# ఎవరు దొంగలు?

**– బోయ జంగయ్య**

రాత్రి పన్నెండయింది.

కాజీపేట స్టేషన్‌లో నాగ్‌పూర్ వైపు వెళ్ళే రైలొచ్చి ఆగింది. తెట్టెలోంచి కందిరీగలు బయటికి వచ్చి నట్టు జనం డబ్బాల్లో నుండి కిందికి దిగారు. జనరల్ కంపార్ట్‌మెంట్‌లో టి.టి.ఐ. జనగాంలో టికెట్ లేకుండా ఎక్కిన ఆరుగురు ప్రయాణికులను గుర్తించి.

"ఎక్కడినుండి వస్తున్నారు?" అని అడిగాడు.

"భోనగిరి నుండి" అన్నారు.

"టికెట్ ఉందా?" "లేదు" "ఫైన్ కట్టండి" నన్నాడు.

"కట్టలేము దొర" అంటూ కాళ్ళావేళ్ళాపడ్డారు.


వాళ్ళభాష గ్రామీణుల భాష అయినప్పటికి పలికే యాసవల్ల ఫలానా ప్రాంతమని చెప్పలేం. భాషను బట్టి వీళ్ళది భువనగిరి కాదని గ్రహించాడు.

"మరెప్పుడూ టికెట్ లేకుండా ఎక్కవద్దు" అని ఓ వార్నింగ్‌ఇచ్చి వది లాడు.

"తరువాత వచ్చే రైలు ఎక్కవచ్చు" అను కుంటూ బెంచీలమీద కూర్చున్నారు.కొన్ని క్షణాల తరువాత...

"ఎవరు మీరు?" అడిగాడు రైల్వే పోలీసు.

"ఇప్పుడే రైలు దిగినం"



అన్నాడు ఒకడు.

"టికెట్ ఏది" అడిగాడు రైల్వే పోలీసు.

"అమ్మో వీడు ఉన్నది ఉన్నట్టు చెప్పి ఇర్కిచ్చెనే" అనుకొని.

"ఇప్పుడే బండి ఎక్కతానికి వొచ్చినం" అన్నాడు మరో వ్యక్తి.

"అచ్చా ఇప్పుడే దిగినం అంటడు. నీవేమో ఎక్కటానికి వచ్చినం అంటవ్ ఏది నిజంబే" అన గానే అందరు తికమకై చూస్తూఉన్నారు.

"ఎక్కటానికి తీసుకున్న టికెట్ ఏది?" అన్నాడు.

తెల్లముఖం వేశారు.

"అరె మీరసలు ఎవర్రా?" ఓ కాలును బెంచి మీదుంచి అడిగాడు రైల్వేపోలీసు.

కాస్త తేరుకుంటూ చుట్టుపక్కల కంకర కుప్పలు కనిపించాయి.

"దొర, దొర, మేం ఆ కంకర కుప్పను కట్టకు పర చటానికి వొచ్చినం"

"అయితే మీరు రైల్ కట్టలేస్తార్రా?"

"ఆఁ" అన్నారు. అయినా అనుమానం తీర లేదు.

'ఈ మధ్య ఓ దొంగలముఠా తిరుగుతుంది" అన్న విషయం గుర్తొచ్చి, చేతిలోని లాఠీని చంక లోకి చేర్చుతూ.

"అచ్చా! ఉండండి" అంటూ విజిల్ ఊదాడు. అంతే! బయట ఉన్న రైల్వే పోలీసులు పరుగెత్తుకొ న్నారు.

"ఏ లోగొంకో లేజాయియే" అన్నాడు.

"చల్‌సాలె, చల్ స్టేషన్ చల్" అంటూ లాఠీ అడించారు పెట్రోలింగ్ జవానులు

"మేము పైకి పోవాలె సార్" అన్నారు. పోలీసులు వినిపించుకోలేదు. కాళ్ళావేళ్ళాప డ్డారు, కనికరించలేదు.తీసుకెళ్ళి స్టేషన్ ముందు కూర్చోబెట్టారు. వాళ్ళ భుజాన కొన్ని చిన్న చిన్న మూటలు ఉన్నాయి.

"ఆ మూటలేముందిర?" అని అడిగాడు.

"అవి ఒకనివి శనిగలు, ఒకని ఉలవలు, మరొక నివి పెసలు" అన్నాడు.

"గాకొంచమెందుకురా" అని అడిగాడు.

"ఆకలైనప్పుడు ఊదికిచ్చుకుని తింటం. కూర, తొక్కు అవసరముండదు" అన్నారు.

"ఓహో" అనుకున్నాడు.

* * *

గేటు కొట్టినా ఇంటి వాళ్ళు లేవలేదు. వచ్చిన ముగ్గురిలో నుంచి ఒక యువకుడు కాంపౌండ్ గోడ ఎక్కి లోపలికి వెళ్ళి తలుపు తట్టాడు.

"ఎవరు?" అని అడిగాడు ఇంటాయన.

"రాములును, రామాపురం నుండి వచ్చినం రంగయ్యమామ" అనగానే గొంతు గుర్తించి.

"వస్తున్న" అంటూ వచ్చి తలుపు తెరిచి, బయ టిలైటు వేసి గేటుకవతల నిలుచున్న వాళ్ళను గుర్తించి గేటు తెరిచాడు. రంగయ్య అ ఊళ్లో ఎం.ఆర్.ఓ. ఆఫీసులో గిరిదావరు.

"ఇంతరాత్రి." అంటూ మిగిలిన ఇద్దరు లోపలికి రాగానే గేటు మూస్తూ అడిగాడు.

"ఈ మధ్య దొంగలు తిరుగుతున్నారు. ఇంతకు ముందే వాడల వారీగా కాపలా కాసి వచ్చిపడుకు న్నాం. పక్క కాలనీలో కూడా అంతే. మొన్న ఎన్ జివో కాలనీలోమూడు ఇళ్ళు, టీచర్స్ కాలనీలో నాలుగిళ్ళు దోచారట. మూడు కాలనీలలో ఏ ఇంట్లో నిద్ర పోవడం లేదు. మాక్కూడా ఇప్పు డిప్పుడే నిద్రప ట్టింది" అన్నాడు.

"మాకు ఇంత అల స్యం కావటానికి అదే కారణం. పదిగంట లకే బస్సు దిగాం. పోలీసులు ఆపి, దొంగలమనే అనుమానంతో స్టేష న్‌కు పట్టుకొని పోయిండు" అన్నాడు ముగ్గురిలో పెద్ద వాడు రాజయ్య.

"పట్టిగ పట్టుకపోయి వది లిండ్రా? రెండు గంటలు కూర్చోబెట్టి పదో పరకో ఇచ్చి నాక అన్ని సంగతులు అడిగి రాసుకొని వదిలిండ్రు" అన్నారు మరొకరు.

"మొదలు అసలు మీరు దొంగలే అనబట్టిరి" మొదటి వ్యక్తి.

"అది పోనీ, అ కాలనీలో, ఈ కాలనీలో దొంగత నం చేసింది మీరే కదూ? అంటూ కర్ర లేపిండు ఓ పోలీసు. అప్పుడు రాజన్న మొఖం ఎర్రచేసుకొని, ఏందండి మీ దౌర్జన్యం? బస్సు ఆలస్యంగా రావ టం వల్ల ఇంత రాత్రయింది. అంతమాత్రాన మేం దొంగలమా? ఫలానా ఊరు, ఇక్కడ ఫలానావారి ఇంటికొచ్చినం, కాకపోతే కనుక్కోండి అంటే గానీప దిలిపెట్టలేదు. రోడ్డుమీదకొచ్చి ఏ రిక్షావాడ్ని రమ్మ న్నారాడు.ఆఖరికి ఎట్లాగో ముగ్గురం ఉన్నాం కదా అని ఆటోని పిలిస్తే డబుల్ ఛార్జీ అంటడు. సరే పద అని వచ్చి ఎంతసేపు గేటుకొట్టినా మీరు లేస్తనే లేరు. ఓ దిక్కుకుక్కలు మొరుగుతున్నాయి" అన్నాడు.

"ఇంతకు ఏమన్నా తిన్నారా, లేదా? అడిగాడు రంగయ్య.

"బస్సు దిగగానే హోటల్లో ఇంత చల్లబడ్డం"

"సరే" అంటూ రంగయ్య తలఊపాడు.

"లేకపోతే అర్ధరాత్రి ముగ్గురు మనుషులకు

వంట."

"గ్యాసు పొయ్యిలేకదా. నిమిషాలలో ఎంత మందికైనా సిద్ధం చెయ్యొచ్చు"

"పొయ్యి ముట్టియ్యమంటారా" అనడిగింది ఇంటావిడ.

"ఏ మొద్దుచెల్లెమ్మా, తినే వచ్చినం" అన్నారు.

"తినొచ్చినం అంటున్నారు కదా వద్దులే అన్నాడు" రంగయ్య.

"రెండు తుంగచాపలు, దుప్పట్లు తీసుకురా, ఇక్కడవరండాలో పరుచు" అన్నాడు తాను అక్కడినుంచి కదులుతూ. పరిచిన చాపల్లో వరుగుతూ.

"ఇంతకుముందే భలే గమ్మత్తు జరిగింది" అన్నాడు ముగ్గురిలో ఒకడు వచ్చేనవ్వును ఆపుకుంటూ.

"ఏం జరిగింది" రంగయ్య.

"మీరు వినలేదా?"

"లేదు, ఇప్పుడిప్పుడే నిద్రలోకి వెళ్ళాం"

"మీ పక్కింట్లో"

"పక్కింట్లో -చెప్పు"

"...మా ఆటో మీ ఇంటి ముందాగింది. అందులో నుండి ముగ్గురం దిగి గేటు కొట్టినం. మీరు లేవలేదు కానీ పక్కింటావిడ తన గేటే కొడుతున్నారని అనుకుంటూ పడుకునే.

"ఈ మధ్య దొంగలు తిరుగుతున్నారుగా. పక్క కాలనీలో మొన్న రెండు మూడిళ్ళు దోచుకున్నారట. వారంరోజులకింద ఎన్‌జివో కాలనీలో కూడా మధ్యరాత్రి పదిళ్ళను దోచుకుపోయారట. వీళ్ళు ఖచ్చితంగా దొంగలే అంది.

మళ్ళీ గేటు చప్పుడు చేసినం.

దుప్పటిని ముఖం మీదికి లాక్కుని శ్వాస బిగబట్టినట్టుంది. ఎలాంటి శబ్దంరాలేదు. మాకు కిటికీలో నుండి కనబడతనే ఉంది. మళ్ళీ గేటు చప్పుడు చేశాం.

సందేహం లేదు, దొంగలే! పోలీసులు రాక ముందే దోచుకోవాలని కావచ్చు అనుకుంటూ మెల్లగా భర్తను చేత్తో తట్టినట్టుంది, గాజుల చప్పుడైంది.

ఈ రోజు అలసిపోయి వచ్చాను. పడుకోఅన్నాడు విసుక్కుంటూ.

"మీ ఘోరం సల్లగుండ, దానికోసం కాదు" అంది చేతితో భుజాన్ని తట్టి కదిలిస్తున్నట్టుంది. మళ్ళీ గాజుల చప్పుడైంది.

"దొంగలున్నట్టుంది. గేటు కొడుతున్నారు" అంది.

"దొంగలు గేటు కొడతారా? గోడదూకి వస్తారు కానీ" అని మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. కాళ్ళను దగ్గరికి ముడుచుకున్నాడు.

"వెంకన్న మన గేటు దూకె కదా!"

"వింటున్నారా! గేటు దూకినట్టుంది" అని చెవిలో చెప్పినట్టుంది. ఆమె తల కదిలింది.

భర్త ఈసారి లేచి కూర్చుంటూ భార్యను, ఇద్దరు పిల్లలను లేపి "దొంగలు దొంగలు" అంటూ అరిచాడు కళ్ళు నలుపుకుంటూ. ఆ తరువాత అందరు చెవులను బయటివైపు ఉంచి నిశ్శబ్దంగా చెవులను నిక్కరించి కూర్చున్నారు.

"ఆటో వెళ్ళిపోతుంది. కానీ దొంగలు అక్కడే ఉన్నారు" అంది భార్య మెడ చుట్టూ కొంగు కప్పుకుంటూ.

"మాట్లాడేది తెలుగే అయినా యాస. బహుశా స్టువర్టుపురం వాళ్ళు కావచ్చు" గుసగుసగా అన్నాడు.

"కొంచెం కిటికీ దగ్గరికి వెళ్ళి చూడండి" అంది తన పుస్తెల తాడును కానరాకుండా లోపలికి నెట్టుతూ.

"నేను చూస్తే బాగుండదు. నీవే చూడు." అన్నాడు.

దుప్పటిని కప్పుకుంటూ పిల్లలు ఇద్దరు కళ్ళు నలుపుకుంటూ కూర్చున్నారు. మధ్య మధ్య ఆవులిస్తున్నారు.

భార్య కిటికీలో నుండి చూసింది. ఇక ఆమె కళ్లు మూసుకొని రెండు చేతులు జోడించి 'ఏడు కొండల వాడా వెంకటరమణా' అంటూ అందర్నీ అనమని సైగచేసింది. అందరూ అలాగే అనసాగారు వాడంతా వినిపించేటట్టు.కానీ అందరూ



నిద్రలో ఉన్నారు కాబట్టి సరిపోయింది.

అప్పటి వరకున్న లైటు తీసేసింది.

ఇక ఆ ఇంట్లో చప్పుడు లేదు.

"దొంగలొస్తే దొంగలుఅని అరుస్తారు కానీ ఏడు కొండలవాడా అంటే ఆయన వచ్చి వీళ్ళను కాపాడుతాడా?" అంటూ నవ్వాడు రాజయ్య.

"చాదస్తపు మనుషులు" రంగయ్య.

* * *

స్టేషన్ ముందు కూర్చోబెట్టిన వాళ్ళను లోపలికి పిలిపించి.

"చెప్పండి, నిజం చెప్పండి" అడిగాడు హెడ్. మనిషి నీటి గుర్రం లాగున్నాడు.

ఎవరూ ఏం మాట్లాడలేదు. మౌనంగా నిలుచున్నారు.

"మీది స్టువర్టుపురం కదూ?" అడిగాడు హెడ్.

కానదన్నట్టు తలలు అడ్డంగా ఊపారు. కడుపు అంటుకపోయి కాళ్ళకు చేతులకు నరాలు తేలి, చేతులు కాయలు కాసి ఉన్నాయి.

"మీరు మంచిగ అడిగితే చెప్పుతారు, ఏయ్ ట్రిబుల్‌నైన్" అంటూ పక్కకు చూశాడు. కూర్చున్న కుర్చీ కిర్ర్ మంది.

"స్సార్" అని పలికాడు పి.సి. నిండుగా, దిండుగా ఉన్నాడు.

"ఓ తడవు పట్టించు" అన్నాడో లేదో వాళ్ళ పిక్కలమీద, తొడల మీద కర్ర వాలసాగింది.గడ గడ వణుకుతున్నారు.

"మీది స్టువర్టుపురమే కదూ?" మళ్ళీ అడిగాడు.

"కాద్దొర, కాద్దొర, కాద్దొర" అన్నారు అందరు. గొంతుల్లో వణుకు వచ్చింది.

"ఏయ్! టూ ఫైవ్ టూ" పిలిచాడు హెడ్. మళ్ళీ కిర్ర్‌మంది.

"సార్" అంటూ వచ్చాడు. చేతిలో గజం పొడవు టైర్ ముక్క. కానీ అనిసైగచేశాడు.

ఇక అంతే రబ్బర్ దెబ్బలకు మొత్తుకున్నారు. దెబ్బ పడినప్పుడల్లా అమ్మా అయ్యా అంటున్నారు.

"ఆపు, మీది స్టువర్ట్‌పురమే కదా?"

"కాదు" అని ఏడుస్తూనే చెప్పారు. అప్పుడు వాళ్ళ కళ్ళ నీళ్ళు నోట్లోకి పోతున్నాయి.

"ఏయ్ ట్రిబుల్ నైన్"

"సార్"

"వీళ్ళజేబులు, నడికట్లు సోదా చెయి" అన్నాడు.

చేశాడు. పదో,ఐదో చిల్లర డబ్బులు, బీడి ముక్కలు, అగ్గిపెట్టెలు దొరికాయి. కాళ్ళు, చేతుల్లో వణుకు తగ్గలేదు.

"చిల్లర తప్ప ఏం, లెవుసారు" అన్నాడు ఆఖరివాడ్ని తడిమిచూస్తూ.

"మీరేమి దొంగలురా. ఒక్క ని దగ్గర ఓ వందా యాభై కూడా లేవు" అన్నాడు హెడ్ అదో మాదిరిగా చూస్తూ.

"లేవు దొర" అన్నట్టు చూశారు ఏడుస్తూనే దెబ్బలు తగిలిన చోట చేతులతో రాసుకుంటూ, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ.

"అంటే ఇంకా దొంగతనం మొదలుపెట్టలేదన్న మాట. అరే అందర్నీ వదిలిపెడతా, దోచుకొస్తారా? సగం, సగం" అన్నాడు కనుబొమ్మలను ఎగరేస్తూ.

"అసలు మేము దొంగలం కాదు దొరా, గుంతలు తవ్వేకూలీలం" ఒక్కసారే గొల్లుమంటూ, చేతులు జోడించి అన్నారు.

"అరె గాడుదుల్లారా! చెప్పరేమిరా" అన్నాడు హెడ్ చెపితే విన్నట్టు.

"చేతిలో పైసలు లేక టికెట్ తీసుకోక రైలెక్కినం. చెకింగుల టికెట్ లేదని దింపేసింద్రు. అక్కడి నుండి పట్టుకొచ్చింద్రు" అంటూ లబోదిబోమన్నారు.

"చల్ పోంద్రిబే" అనగానే-

బిక్కుబిక్కుమంటూ కన్నీళ్ళు తుడుచుకుంటూ అక్కడి నుండి కదిలారు ఆ అమాయక ప్రాణులు.

* * *

మరునాడు ఓ దినపత్రికలో పోలీసు డిపార్టుమెంటు వాళ్ళ ప్రకటన.

"వరంగల్ నగరంలోని హన్మకొండ ప్రాంతంలో దొంగల బెడద నివారణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు. మొన్న ఐదుగురు స్టువర్టుపురం దొంగలను, మరో అంతర్రాష్ట్రీయ దొంగల ముఠాకు సంబంధించిన ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకున్నాం. అందువల్ల ఇక మీదట ఈ నగరంలో దొంగల భయం ఉండదు. ఎవరికైనా అనుమానం అనిపిస్తే వెంటనే టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు కానీ, టౌన్ పోలీస్ స్టేషన్‌కుకానీ ఫోను చెయ్యవలసింది" ●